
# పరిష్కారం



**బాధ్యతలు తెలీని వాళ్ల భుజం తట్టి ముందుకు నడిపించే కథ**

## కె.వి.సీత

"జాగ్రత్తగా వెళ్లు నీరజా. నే చెప్పింది గుర్తుందిగా! ఇక్కడ బానే చూసుకుంటా. ఎప్పటికప్పుడు నీకు ఫోన్ చేస్తుంటా సరేనా?" ట్రైన్ కదల బోతుండగా నీరజతో మరోసారి చెప్పింది గీత.

"నువ్విక్కడుండగా నాకేం దిగులు గీతా. అమ్మతో చెప్పాను. ఏం కావాలన్నా నిన్నడగమని"

"అది సరే. మన పందెం గుర్తుందిగా? నేనిప్పుడు నీరజని. నువ్వు గీతవి. నవ్వుతూ తుళ్లుతూ ఉండాలి నాలా. అన్ని టెన్షన్లూ మరిచిపోయి హాయిగా ఎంజాయ్ చెయ్యి. మరి నే దిగుతున్నా బై"

గేటు దగ్గర నిలబడి గీత కనుమరుగయ్యేదాకా చూసి కంపార్టుమెంటులోకొచ్చి కూర్చుంది నీరజ, గీత మాటలు మననం చేసుకుంటూ.

'మన పందెం గుర్తుందిగా?' నవ్వొచ్చింది.

సరిగ్గా వారం రోజుల క్రితం జరిగింది గుర్తొచ్చింది.

ఎప్పుడూ నవ్వుతూ సరదాగా ఉంటుంది గీత. "ఐ డోంట్ లైక్ హెవీ ఫేసెస్, హెవీ డైలాగ్స్. కాస్త నవ్వుతూ ఉండవే బాబూ నాలా" అంటుంటుంది.

"నీకేంటే అదృష్టవంతురాలివి. జీవితంలో కావల్సినవన్నీ దొరికేయి. హ్యాపీగా ఉండగలవు. నీలా నేనెలా ఉండగలను చెప్పు?"

"అంతేకానీ ఇది నా స్వభావం అని ఒప్పుకోవు"

"హలో! పరిస్థితులని బట్టి స్వభావాలు కూడా మారుతాయమ్మా. నీకేం తెలుసు?"

"అలాగా! అంటే నువ్వు నా ప్లేస్‌లో ఉంటే నాలా హ్యాపీగా చలాకీగా ఉంటావు. నేను కానీ నీ పరిస్థితిలో ఉంటే నీలా హెవీ డైలాగ్స్ చెప్తూ, భూభారం అంతా మోస్తున్నట్టుగా కనిపిస్తానంటావా?"

తండ్రీ, ఏ బాధ్యతా పట్టకుండా పైలాపచ్చీసుగా తిరిగే పెద్దతమ్ముడూ, కాబోయే భర్త కోసం కలల ప్రపంచంలో విహరించే చెల్లెలు, చిన్నప్పుడు పోలియో వచ్చి ఒక కాలు చచ్చుపడిపోయిన చిన్న చెల్లెలు, ఇంకా హైస్కూల్ చదువు కూడా పూర్తి కాని చిన్న తమ్ముడూ, వీళ్లందరినీ చూస్తూ, 'ఈ సంసారాన్నెలా ఈదనురా దేవుడా' అంటూ రోజుకోసారైనా గుండె బాదుకునే తల్లీ, ఇదీ తన కుటుంబం.

అంతులేనికథ లాంటి జీవితం తనది. ఈ బాధ్యతలు తీరేవి కావు. దాని పిచ్చి కానీ అది మాత్రం ఏం చెయ్యగలదు? విరక్తిగా అనుకుంది.

ఏమయినా తన కోసం ప్రాణం ఇచ్చే స్నేహితురాలుంది. అది చాలు. "అయితే నేనేమీ కానా?" సురేష్ ప్రశ్నించినట్టయింది.

"నీతో జీవితాన్నే కాదు బాధ్యతల్ని కూడా పంచుకుంటా నీరజా"

ఎన్నోసార్లు భరోసా ఇచ్చాడు సురేష్. కానీ తనే

"దరిదాపుగా అంతే"

"ష్యూర్?"

"ఎస్!"

"సరే, కేరక్టర్స్ మార్చుకుందామా? నేను నీరజని. నువ్విప్పుడు గీతవి. ఇంకా చెప్పాలంటే మూడేళ్ల క్రితం పెళ్లికాక ముందు హాస్టల్లో ఉండే గీతవి"

"బాగుంది. అయితే నేనిప్పుడు హాస్టల్లో ఉండాలా?"

"ఎలాగూ ఉండాలి కదా! రెండు నెలలు డెప్యుటేషన్ మీద బెంగుళూర్ వెళ్లబోతున్నావుగా? ఆ నెల రోజులయినా చీకూచింతా లేకుండా హాయిగా నాలా ఉండు. ఇక్కడ నేను నీ బాధ్యతలని మోస్తూ మీ వాళ్ల సందర్భీ ఎలా దారికి తెస్తానో చూడు. నన్ను నమ్మితే నాతో పందెం కాయి"

"నిన్ను గాక ఇంకెవరిని నమ్ముతాను నేను? కానీ ఓడిపోతే మాత్రం ఫీలవ్వకు. మా వాళ్ల సంగతి నీకు తెలీదు"

"అదీ చూద్దాం. ఇంకో సంగతి. ఈ విషయంలో నువ్వు ఏమాత్రం ఇన్వాల్వ్ కాకూడదు. వాళ్లని కాంటాక్ట్ చేయకూడదు మధ్యలో. ఓకేనా?"

తన ఇంటి పరిస్థితి దానికి తెలియంది కాదు. సంసారాన్ని మొయ్యలేక ఇల్లొదిలి వెళ్లిపోయిన

ధైర్యం చెయ్యలేకపోతోంది.

చల్లగాలి రివ్వున కొడుతోంది. కిటికీ మూసి సూట్‌కేస్‌లోంచి దుప్పటి తీసి బెర్త్ మీద పరచుకుంది నీరజ. మెల్లగా కళ్లు మూసుకుంది.

"ఇప్పుడైనా నీ గురించి నువ్వు ఆలోచించు నీరజా. నీ జీవితం గురించి, నీతో కలసి నడవాలనుకునే సురేష్ గురించి" గీత మాటలు చెవిలో రింగుమంటుంటే నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

ooo

రెండ్రోజుల తరువాత గీత ఆఫీసులో ఉండగా సెల్‌ఫోన్ రింగయింది. నీరజ చెల్లెలు గిరిజ. "అక్కా! నువ్వు అర్జెంట్‌గా రావాలి" దాని స్వరంలో ఆందోళన. "అంతా ఇక్కడికొచ్చాక చెబుతా"

"సరే వస్తున్నా" ఆఫీసుకు సెలవు పెట్టి వెళ్లింది గీత. గీతని చూడగానే బావురుమంది నీరజ తల్లి సుభద్రమ్మ.

"చూశావా అమ్మా ఎంత పని చేసిందో" మడత పెట్టిన కాగితం చేతిలో పెట్టింది. విప్పి చదివింది గీత. "అమ్మా! నన్ను క్షమించు. నేను సురేష్‌ని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నాను. ఈ మాట నీతో చెప్పే ధైర్యం లేకే ఇలా ఉత్తరం రాస్తున్నా. నేను బెంగుళూరు వెళ్లింది సురేష్ కోసం. అక్కడే నాకు ఉద్యోగం దొరికింది. ఇంటి ఖర్చుల కోసం ప్రతి నెలా డబ్బు పంపి

స్తాను. ఈ విషయంలో దిగులు పడొద్దు.

నీరజ"

"వెళ్లేటప్పుడు అన్ని అప్పగింతలు పెడుతుంటే ఏమో అనుకున్నానమ్మా. ఇలా అన్యాయం చేస్తుందనుకోలేదు"

"ఎంత పని చేసిందాంటీ? సురేష్‌ని ప్రేమిస్తోందని తెలుసు కానీ, ఇలా తొందర పడిపోతుందనుకోలేదు. నాకొక్కమాటా



చెప్పకుండా నిర్ణయం తీసేసుకుంది"

"రేపట్నించీ, మేమెలా బతకాలే తల్లీ? దాని దారి అది చూసుకుంది"

"మీరలా కంగారు పడకండి ఆంటీ. నేను ఎలాగైనా నీరజ ఎడ్రస్ పట్టుకుంటా. ధైర్యంగా ఉండండి" ఆవిడ చేతులు పట్టుకుని కూర్చోబెట్టింది. "ఈ విషయం గట్టిగా మాట్లాడి రచ్చచెయ్యకండి. నీరజ ఆఫీస్ పని మీద వెళ్లిందనే అందరూ అనుకోవాలి. తర్వాతేం చెయ్యాలో నెమ్మదిగా ఆలోచిద్దాం"

"ఏదో మీతో చెప్పడానికి ధైర్యం లేక అలా వెళ్లిపోయిందేమో కానీ, నీరజ మిమ్మల్ని వదిలి ఉండగలదా? అయినా ఇంటి ఖర్చుల కోసం డబ్బు పంపిస్తానంది కదా! మరీ అంత బెంబేలు పడక్కర్లేదు" అనునయిస్తూ అంది.

"అయ్యో తల్లీ! ఒకసారి పెళ్లంటూ జరిగాక ఇక అది మన పిల్ల కాదు. డబ్బు పంపటం, మానటం దాని చేతుల్లో ఉంటుందా?"

"మీరిలా మాట్లాడుతుంటే పిల్లలు మరీ బెంబేలెత్తిపోరా ఆంటీ? కాస్త నెమ్మదించండి. మేమంతా లేమూ?" ఆవిడ పక్కనే కూర్చుంటూ అంది.

"అయినా ఆంటీ ఇంటి యజమాని వెళ్లిపోయినప్పుడే మీరు ధైర్యంగా నిలబడ్డారు. ఇప్పుడిలా డీలా పడిపోతే ఎలా? ఎప్పటికయినా నీరజ బయటకు వెళ్లేదే కదా! ఎటొచ్చీ ఇలా వెళ్లిపోయిందనే తప్పు"

"నిజమేనమ్మా. కానీ ఇంత మందీ దాని జీతం మీదే బతుకుతున్నాం కదా! పూర్తిగా ఆడపిల్ల మీద ఆధారపడిపోయాం"

విసురుగా లేచాడు నీరజ పెద్ద తమ్ముడు రాజేష్. చాలా అసహనంగా ఉంది వాడికి. చిన్నవాడు వాసు దిగులుగా చూస్తున్నాడు.

గోడకి జారపడి కూర్చుంది చిన్నచెల్లెలు అమల నిర్లిప్తంగా.

"గిరిజా పద. వంట చేద్దాం. ఇలా బెగిలిపోతే ఎలా? ధైర్యం తెచ్చుకోవాలి. ఏదో మార్గం దొరక్కపోదు"

గిరిజకు వంటలో సహాయపడుతూ మధ్యమధ్యలో హాల్లోకొచ్చి మాట్లాడుతోంది గీత.

గీత మాటకారితనంతో చాకచక్యంతో మెల్లగా వాతావరణం తేలికయింది.

సాయంత్రమయింది.

"చీకటి పడుతోంది. ఇక వెళ్లమ్మా గీతా! ప్రకాష్ చూస్తుంటాడు"

"ప్రకాష్ లేడాంటీ. క్యాంప్ వెళ్లాడు. నాలుగు రోజులు నేను ఫ్రీ"

"ఏమే నిజం చెప్పు. నేనేమైనా అఘాయిత్యం చేసుకుంటానని భయపడుతున్నావా?"

"అబ్బే అదేం లేదాంటీ. అయినా ఇలాంటి పరిస్థితుల్లో మిమ్మల్నొదిలి నేనెలా వెళ్లిపోతాను చెప్పండి?"

"పోనీలేమ్మా. నీకైనా అభిమానం ఉంది" ఆవిడ గొంతు రుద్ధమైంది.

"ఎవరికి లేదో?" మనసులో అనుకుంది గీత. ఒక్క రోజులో నీరజ పరాయిదయిపోయింది.

ఇక్కడ సమస్య నీరజ అలా చెప్పకుండా వెళ్లిపోయిందని కాదు. అసలు నీరజ పెళ్లి చేసుకోవడమే నేరం వీళ్ల దృష్టిలో. కుటుంబ బాధ్యత మోస్తున్న పాపానికి అదలా వృద్ధకన్యగా మిగిలిపోవలసిందే. ఎంత స్వార్థం? ఏమయినా వీళ్లని ఆదుకోవలసిన బాధ్యత తనది.

ఇంటికెళ్లి బ్యాగ్‌లో తన బట్టలూ సామాన్లూ తెచ్చుకుంది గీత. రెండ్రోజులక్కడే ఉంది. గీత పక్కనుండటంతో కాస్త ధైర్యంగా ఉంది వాళ్లకి. మెల్లమెల్లగా అందరూ తేరుకుంటున్నారు. కానీ అందరి మనసుల్లో ఒకటే దిగులు 'ముందు ముందెలా జరుగుతుంది?'

○○○

గిరిజ చేసిచ్చిన టిఫిన్ తిని, ఆఫీసుకు వెళ్లడానికి తయారవుతుంది గీత.

"అక్కా!" వెనక్కి తిరిగింది.

క్రెచెస్ సాయంతో మెల్లగా నడుస్తూ వస్తోంది అమల.

"ఇది చూడు" ఒక పేపర్ కటింగ్ ఇచ్చింది. న్యూస్‌పేపర్‌లోంచి కట్‌చేసిన యాడ్. చదివింది గీత.

"ఇంటి దగ్గరే ఉండి అగర్‌బత్తీలు ప్యాక్ చేసి సంపాదించండి" రాసుంది.

"రోజంతా ఊరికే కూర్చుంటే నాకేం తోచటం లేదక్కా. ఇది సులువుగా చేసే పనే కదా! నేను కూడా కొంచెం సంపాదించి ఇంటి ఖర్చులకి సాయపడతానక్కా"

అమలవైపే చూస్తోంది గీత.

అన్ని అవయవాలు సవ్యంగా ఉన్న వీళ్లందరూ ఎవరు పోషిస్తారా అని ఎదురుచూస్తుంటే, కాలు సహకరించకపోయినా ధైర్యంగా నిలబడాలని ఎంత తాపత్రయం? గీత కళ్లు చెమర్చాయి.

"ప్లీజ్ అక్కా! ఈ సహాయం చెయ్యవూ?"

"తప్పకుండా చేస్తానమ్మా" ఆప్యాయంగా అంది. "ఇదే కాదు, నువ్వు చెయ్యగలిగినవి చాలా ఉన్నాయి. నేను ట్రైనింగ్ ఇప్పిస్తాను. నువ్వు చక్కగా సంపాదించుకుని దర్జాగా బ్రతకగలవు"

అమల ముఖంలో వెలుగు. తనని చూసి జాలిపడ్డ వాళ్లే తప్ప, ఇలా ఉత్సాహపరచిన వాళ్లూ, ప్రోత్సహించిన వాళ్లూ ఎవరూ లేరు.

"మరయితే రేపట్నించి నేర్పిస్తావా?" ఆశగా అడిగింది.

"ఈ రోజు నుండే ఆ పనిమీదుంటా. ఓకే?"

○○○

"బాగుందమ్మా. చివరికి అవిటిదాని చేత పనిచేయించాలా?"

"అలా అవిటిది అవిటిది అనొద్దు ఆంటీ. దానికో ఉపాధి చూపిస్తే ఎవరికీ భారం కాకుండా స్వతంత్రంగా బ్రతుకుతుంది కదా! అయినా ఇన్నాళ్లూ అదెలా బ్రతుకుతుందనేగా మీరు బాధపడేవారు. ఎలా బతకొచ్చో అదే నిర్ణయించుకుంది"

"మీకెవరికీ రాని ఆలోచన దానికొచ్చింది. దాన్ని డిస్కరేజ్ చెయ్యకండి. ఒక వ్యాపకం దొరికితే దాని అవకలనాన్ని మరచిపోయి సంతోషంగా బ్రతుకుతుంది"

సుభద్రమ్మ ఏం మాట్లాడలేదు.

"ఇలా నాలుగ్గోడల మధ్య కూర్చునే ఈ విధంగా ఆలోచించింది. దానికి బయట ప్రపంచాన్ని చూపిస్తే ఎన్ని అద్భుతాలు చేస్తుందో? మీకు తెలుసా ఆంటీ ఈ రోజుల్లో అంగవైకల్యం ఉన్నవాళ్లు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. వ్యాపారాలు చేస్తున్నారు. ఎవరి ఆధారం లేకుండా హాయిగా బతుకుతున్నారు"

గీత మాట్లాడుతుంటే అలా వింటోంది సుభద్రమ్మ. ఆవిడకిలాంటివి తెలీదు. అవిటివాళ్లంటే జీవితాంతం శాపగ్రస్థుల్లా ఉండటమే అనుకుంది తప్ప వాళ్లకీ అందరిలా అవకాశాలున్నాయనీ స్వతంత్రంగా బ్రతకగలదనీ అనుకోలేదు.

ఆ మాటే అంది గీతతో. "దానికో ఆధారం దొరుకుతుందంటే అంతకన్నా ఏం కావాలమ్మా? అలాగే కానీ. నీ మాటెందుకు కాదనడం?"

○○○

ఓ పక్క అగర్‌బత్తీలు ప్యాకింగ్ చేస్తూనే కొవ్వొత్తుల తయారీ కూడా చేయటం నేర్చుకుంది అమల. వాసు కూడా సాయంత్రం స్కూల్ నుండి రాగానే అమలకి సహాయం చేస్తున్నాడు. అగర్‌బత్తీ ప్యాకెట్లు డిస్ట్రిబ్యూటర్ వచ్చి తీసుకెళుతున్నాడు. కేండిల్స్‌కి కావల్సిన ముడిసరుకు తీసుకురావడం, తయారయిన ప్రొడక్ట్స్ మార్కెట్‌కి తీసుకెళ్లడం వాసు పని.

నాలుగు డబ్బులు కళ్లబడటంతో వాళ్లకి చాలా ఉత్సాహంగా ఉంది. ముఖ్యంగా ఎప్పుడూ స్తబ్దుగా, నిర్లిప్తంగా ఉండే అమల చలాకీగా తయారయింది.

అంతా గమనిస్తోంది సుభద్రమ్మ.

"అయితే అమ్మాయ్! ఇలా ఇంట్లో కూర్చుని కూడా చిన్నచిన్న వ్యాపారాలు చెయ్యొచ్చన్నమాట"

"బేషుగ్గా చెయ్యొచ్చు ఆంటీ. చెయ్యాలే కానీ బోలెడన్ని ఉపాధి మార్గాలున్నాయి"

"ఊ.." దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది. "అయినా నాలాంటి దానికేం చేతనవుతాయిలే. ఏదో ఇంత వండిపడెయ్యడం తప్ప"

గీతకి అర్థమవుతోంది. ఆవిడకి కూడా ఏదైనా చేసి డబ్బు



## మరో బాలు-స్వప్న!

సుమారు ముప్పయ్యేళ్ల క్రితం కమల్‌హాసన్-సరిత జంటగా వచ్చిన 'మరో చరిత్ర' చరిత్ర సృష్టించింది. అందులో బాలు-స్వప్న పాత్రలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టున్నాయి. మళ్లీ ఇప్పుడు ఆ సినిమా సెంట్రల్ థీమ్‌ని తీసుకుంటూ కొన్ని మార్పులతో తెరకెక్కుతున్న సరికొత్త 'మరో చరిత్ర'లో యువహీరో వరుణ్ సందేశ్- కొత్త అమ్మాయి అనిత జంటగా నటిస్తున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా చాలా భాగం అమెరికాలోనే షూటింగ్ జరుపుకుంటుంది.

సంపాదించాలని ఉంది. చెప్పటానికి తటపటాయిస్తోంది.

"ఎందుకు చెయ్యలేరు ఆంటీ? ఫుడ్‌ప్రాడక్ట్స్‌కి గిరాకీ ఎక్కువే. పాప్‌కార్న్, కార్న్‌ఫ్లేక్స్ లాంటివయితే చాలా ఈజీగా తయారుచెయ్యొచ్చు. హాట్ హాట్‌గా అమ్ముడుపోతాయి"

ఆపాటి భరోసా చాలు. ఆవిడ కూడా రంగంలోకి దిగిపోయింది. గీత చొరవతో మార్కెటింగ్ సులువయింది.

చేసిన కష్టానికి ప్రతిఫలం కనిపిస్తుంటే ఆవిడలో ఎక్కడ లేని ఓపికా, ఉత్సాహం పొంగుకొచ్చాయి. 'తను కూడా సంపాదించగలదు. ఇలాంటి అవకాశాలు ముందే వచ్చుంటే నీరజ మీద పూర్తిగా ఆధారపడిపోయే వాళ్లం కాదు కదా' అనుకుంది.

ఏనాడూ ఈ కోణంలో ఆలోచించలేదు. నీరజని సెంటిమెంట్‌తో కట్టిపడెయ్యాలనుకుంది తప్ప ఓ ఇంటిదాన్ని చెయ్యాలన్న ఆలోచనే రాలేదు. ఎంత సేపూ నీరజ బయటికెళ్లిపోతే ఎలా అన్న భయమే. మొదటిసారి పశ్చాత్తాపం కలిగిందావిడలో.

ooo

గిరిజ తన కలలప్రపంచం వదిలి మెల్లగా ఇలలోకి వస్తోంది. ఇన్నాళ్లూ ఎంత వ్యర్థంగా గడిపిందో అర్థమవుతోంది. చిన్నవాళ్లిద్దరూ ధైర్యంగా ఇంటి బాధ్యతల్లో పాల్పంచుకుంటుంటే తనిలా కూర్చోవడం గిల్టీగా ఉంది.

ఒకప్పుడు తన అందచందాలు మెరుగులు దిద్దుకోవడం కోసం నేర్చుకున్న బ్యూటీషియన్ కోర్స్ ఇప్పుడు అక్కరకు వచ్చింది.

ఒక బ్యూటీషియన్ దగ్గర అసిస్టెంట్‌గా చేరింది. 'ఒకటి రెండేళ్లు కష్టపడితే తను కూడా ఒక బ్యూటీపార్లర్ పెట్టుకోవచ్చు. ఎవరి ఆధారం అక్కరలేదు' మనసులో అనుకుంది.

రాజేష్ పరిస్థితి మరీ ఇరకాటంగా ఉంది. ఇంట్లో ఒకదాని వెనుక ఒకటి జరుగుతున్న సంఘటనలు దిమ్మెరపోయేలా చేస్తున్నాయి. నీరజ తర్వాత పెద్ద వాడు తనే. కుటుంబ బాధ్యతలు మోసే అంత సీను తనకెలాగూ లేదు. తనే ఒక బరువయ్యాడు ఇంట్లో. చిన్నవాళ్లయిన చెల్లెళ్లూ, తమ్ముడూ, చివరకు వృద్ధురాలయిన తల్లీ అందరూ కష్టపడి సంపాదిస్తుంటే తినే అర్హత తనకెక్కడుంది? ఇంట్లో ఉండలేడూ, అలా అని బయటకెళ్లి బతకలేడూ. తన మీద తనకే అసహ్యం వేస్తోంది.

చిన్నచిన్న ఉద్యోగావకాశాలెన్నో జారవిడుచుకున్నాడు చేతులారా. 'ఒరేయ్ నీలాంటి పర్సనాలిటీ, మాటకారితనం ఉన్నవాడు బిజినెస్‌లో బాగా రాణిస్తారని ఫ్రెండ్స్ అంటుండేవారు. తనకున్న ఆ ఒక్క ప్లస్‌పాయింట్‌నీ ఉపయోగించుకోవాలి.

ఎలాగయితేనేం తిరిగి తిరిగి ఒక కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం సంపాదించాడు. జీతం + కమిషన్.

"కష్టపడితే ఫ్యూచర్ ఉంటుంది" ఆఫీసర్ అన్నాడు.

"తప్పకుండా కష్టపడతాను. నేను మునుపటి రాజేష్‌ని కాను" మనసులో అనుకున్నాడు.

స్వీట్స్ కొని ఇంటికి తీసికెళ్లాడు. సుభద్రమ్మ ఆనందానికి అంతులేదు. ఎందుకూ పనికిరాడనుకున్న కొడుకిలా దారికి రావడం, పుత్రోత్సాహం పెల్లుబికింది మొదటిసారిగా.

"గిరిజా వెంటనే గీతని రమ్మను. మాట్లాడాలి"

ooo

గుమ్మంలో నిలబడి అలా చూస్తోంది గీత. ఇంట్లో ఒక పండగ వాతావరణం కనిపిస్తోంది. సరిగ్గా 25 రోజుల క్రితం విచారం నిండిన ఇంట్లో ఆనందం తాండవిస్తుంది. ఇంతలో ఎన్ని మార్పులు? "గీతక్క వచ్చింది" వాసు అరిచాడు.

స్వీట్స్ పట్టుకొచ్చింది సుభద్రమ్మ. ఒక స్వీట్ తీసి గీత నోట్లో పెట్టింది అమల. కడుపు నిండిపోయింది గీతకి. ఇప్పుడు గానీ నీరజ ఉంటే ఎంత సంతోషించేదో కదా! ఇంతలో సుభద్రమ్మే అంది.

"చూడమ్మా గీతా. నువ్వేం చేస్తావో తెలీదు. ఎలాగైనా నీరజకి కబురు పంపించు. జరిగిందేదో జరిగిపోయింది. ఇదీ మంచికే జరిగింది. ఇక మా కుటుంబానికేం లోటు లేదు. మా బతుకు మేం బతకగలం. అది మాకు డబ్బులు పంపించక్కరలేదు. అది ఎక్కడున్నా సుఖంగా ఉంటే చాలు. నా మాటగా చెప్పి కబురు పెట్టు తల్లీ" గీత రెండు చేతులూ పట్టుకుంది.

"అలాగే ఆంటీ ఈ రోజే నీరజని కాంటాక్ట్ చేస్తాను"

"అక్కా బావలకి మంచి రిసెప్షన్ ఎరేంజ్ చెయ్యాలి" రాజేష్ అంటున్నాడు.

ooo


"సక్సెస్ నీరజా! గ్రాండ్ సక్సెస్. మీ ఇంట్లో ఎలా నవ్వులు విరబూస్తున్నాయో చూడు. వాళ్లందరిలో ఆత్మవిశ్వాసం చూడు. నీ చెల్లెళ్లూ, తమ్ముళ్లూ అందరూ నువ్వు గర్వపడేలా తయారయ్యారు తెలుసా?" ఫోన్ చేసింది నీరజకి గీత.

"నిజంగా? అసలిదంతా ఎలా?"

"మీ వాళ్లంతా నీ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు నీరజా. నువ్వు తెచ్చే జీతం కోసం

## ఆ సంగతి అడక్కండి

ఆయేషా టకియా పెళ్లిచేసుకుంటోందని కొంత కాలంగా వినిపిస్తూనే వుంది. ఏమైంది మేడమ్ మీ పెళ్లి సంగతి? అని అడిగితే- అవన్నీ నా పర్సనల్ సంగతులు. అలాంటి వాటికి జవాబు చెప్పను- అంటూ చిరాకుపడుతోంది. సరే, సినిమాల మాటేమిటి? అంటే- అవకాశాలు వస్తున్నంత వరకూ సినిమాల్లో నటిస్తూనే వుంటాను, గుడ్‌బై చెప్పే ప్రసక్తే లేదు- అంటూ తెలివిగా సమాధానమిస్తోంది ఆయేషా. అంటే పెళ్లయ్యాక కూడా ఆయేషా సినిమాల్లో నటిస్తుందనేగా!



కాదే. నీ కోసం. నిన్ను చూడాలి. నీలో ఆనందం చూడాలని. ఇంకా చెప్పాలంటే నువ్వు జంటగా తిరిగొస్తే చూసి ఆనందించాలనీ"

"ఏంటీ నువ్వు మాట్లాడుతున్నది? నేను జంటగా రావడమేమిటి? నాకంతా అయోమయంగా ఉంది. అయినా నువ్వేంటి అంత పెద్ద పెద్ద డైలాగ్స్ చెప్తున్నావు. నాక్కూడా అర్థం కానంత."

"అవును. నేనిప్పుడు నీరజని కదా! అందుకే భారీ డైలాగ్స్ వచ్చేస్తున్నాయి. సరేలే. నిన్నింక కన్ఫ్యూజ్ చెయ్యను. నీకో నిజం చెప్పేస్తాను. నన్ను తన్ననంటే" జరిగిందంతా వివరించింది గీత.

నివ్వెరపోయింది నీరజ. "ఏమిటీ? నేను రాసినట్టుగా ఉత్తరం రాసి పెట్టావా? అది చూసి మా వాళ్లు నేను పెళ్లి చేసుకుని వెళ్లిపోయాననుకున్నారా? ఏమిటీ ఇదీ?" బాధగా అంది. "ఇందుకేనా ఇన్నాళ్లు నన్ను మాట్లాడకుండా కట్టిపడేశావ్?"

"లేకపోతే? వాళ్లు దారికి రావద్దూ? వాళ్లలో అంత మార్పెందుకు వచ్చిందనుకున్నావ్? నీరజా! నువ్వు భారం మోసినంత కాలం ఎవరూ చిన్న సాయం కూడా చెయ్యలేదు. నువ్వు వదిలేస్తే తెలిసింది ఎవరి బ్రతుకు వాళ్లు బతకాలని. నువ్వు తప్పుకుంటేనే ఇవన్నీ జరుగుతాయి"

"అయినా నీరజా! నేను మీ వాళ్లనెవర్నీ నొప్పించలేదు. ఒక్క మాట కూడా అనలేదు. క్లాస్ పీకలేదు. వాళ్లంతట వాళ్లే పరిస్థితి తెలుసుకున్నారు. నన్ను నమ్ము" అంది. "నేను సపోర్ట్‌గా నిలబడ్డానులే. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ పరిస్థితీ రాకుండా కాపలాగా ఉన్నానంతే"

నీరజ కళ్లలో నీళ్లు తిరిగాయి. తన కోసం, తన కుటుంబం కోసం ఎంత తాపత్రయ పడిందో కదా! ఏదో నేరం చేసినట్టూ దాన్నలా నిలదియ్యడమేమిటి? తను చెయ్యలేని పని అది చేసింది. మెల్లగా తేరుకుంది నీరజ.

"గీతా! నిజమేనే. నువ్వు ప్రాక్టికల్. నేను సెంటిమెంటల్ ఫూల్‌ని. ఒప్పుకుంటున్నాను. నాకు ప్రేమ తప్ప ఇంకేమీ తెలియదు. నేను మా వాళ్లందరి బరువు బాధ్యతలూ మోస్తున్నాననుకున్నానే కానీ, వాళ్లకి అసలే బాధ్యతా తెలియకుండా చేస్తున్నాననుకోలేదు. నేనెంత బాగా ఆలోచించలేదు. నిజంగా నువ్వే కరెక్ట్. వాళ్లకి నువ్వు చేసిందే నిజమయిన సాయం"

ఒక్క క్షణం ఆగింది.



"కేరక్టర్స్ మార్చుకుందామని సరదాగా అన్నావనుకున్నాగానీ, నిజంగానే నువ్వు నా పాత్రలోకి పరకాయప్రవేశం చేసి నా సమస్య పరిష్కరిస్తానని ఏ మాత్రం అనుకోలేదు. ఇంతలో ఇన్ని మార్పులు? ఇన్ని అద్భుతాలు?"

"ఆగాగు నీరజా! నన్ను మరీ అంత పొగిడెయ్యకు. ఒక్క రెండు నెలల్లో ఇన్ని అద్భుతాలు జరిగేయంటే అది నా గొప్పదనం ఏమాత్రం కాదు. నేనింత ఊహించలేదు కూడా. నీ పెళ్లికి మార్గం సుగమం చెయ్యాలని మాత్రమే అనుకున్నాను. దానికి మీ వాళ్లని మెంటల్‌గా ప్రిపేర్ చెయ్యాలని అనుకున్నాను. పెళ్లయ్యాక కూడా నీ కుటుంబానికి నువ్వు ఆర్థిక సాయం ఎలాగూ చేస్తావు. దానికి సురేష్ కూడా ఒప్పుకున్నాడు. ఈపాటిదానికి నువ్వు పెళ్లిచేసుకోకుండా ఉండిపోవడంలో అర్థం లేదు. త్యాగం అంతకన్నా కాదు. ఎటొచ్చీ ఆ విషయం నువ్వు చెప్పి ఒప్పించలేవు. అందుకే నేను ప్రవేశించాను. కాకపోతే ఇక్కడ పరిస్థితి ఇలా మలుపుతిరగడానికి ముఖ్య కారణం అమల. నిలబడలేని పిల్లకున్న ఆత్మవిశ్వాసం, ధైర్యం అందరికీ పాఠం నేర్పింది. ఆ సంఘటన మొత్తం అందరినీ మార్చింది. ఇది మనందరి అదృష్టం"

"ఏమైనా సంకల్పం నీది. ఆపైన పరిస్థితులన్నీ అనుకూలించాయి. నేనూ, నా కుటుంబం నీకు రుణపడి ఉంటాం. చెప్పవే ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"అదీ. అలా రా దారికి" నవ్వేసింది గీత. "నేనాడిన నాటకాన్ని నువ్వు నిజం చెయ్యాలి. నేను సురేష్‌తో ఆల్రెడీ మాట్లాడాను. సరిగ్గా వారం రోజుల్లో నీ పెళ్లి సురేష్‌తో జరుగుతుంది. అయితే ఇది దొంగపెళ్లి కాదు సుమా. నువ్వు కోరుకున్నట్టు అందరి అంగీకారంతో పెద్దవాళ్ల సమక్షంలో జరుగుతుంది. సరేనా? రెండ్రోజుల్లో ఎలాగూ నీ వర్క్ అయిపోతుంది గా. వెంటనే నువ్వు బయలుదేరి వచ్చెయ్యి. నిన్ను పెళ్లికూతురుగా చూసే శుభఘడియ కోసం ఎదురుచూస్తుంటాను. మరి నే ఉంటా. సురేష్ నీ ఫోన్ కోసం చూస్తుంటాడు. బై"

## అక్కడా క్రేజే!

అనుష్కకి 'అరుంధతి' విజయం బ్రహ్మాండమైన క్రేజ్‌ని తెచ్చి పెట్టింది. కేవలం తెలుగులోనే కాదు, ఇప్పుడు తమిళ నాట కూడా ఆమెతో సినిమాలు తీయాలని నిర్మాతలు ఉత్సాహం కనబరుస్తున్నారట. అయితే ఏ భాషయినా పారితోషికం విషయంలో నిర్మొహమాటంగా వుంటానన్నట్టు కోటి రూపాయలిస్తేనే చేస్తానని డిమాండ్ చేస్తోందిట అనుష్క. మరి ఆమె డిమాండ్ నచ్చిన వాళ్లే సినిమాకి సైన్ చేయించుకుంటారు. ఈ నేపథ్యంలో ఎన్ని తమిళ సినిమాలు అనుష్క చేస్తుందో చూడాలి.